క్లుప్తంగా

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా పద్మావతి



పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా కేవీ పద్మావతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ ఆమె బదిలీపై పెద్దాపురానికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న జంపా సురేంద్ర గ్రేటర్ విశాఖపట్టణం మున్సిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. పద్మావతికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీడీఓగా ఉషారాణి



పెద్దాపురం: స్థానిక ఎంపీడీఓగా ఎం.ఉషారాణి నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉన్నతాధికారులు ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ పని చేసిన ఎంపీడీఓ అశోక్‌కుమార్ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఉషారాణిని ఇక్కడ నియమిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు మరో రెండు రోజుల్లో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

వైభవంగా మఖ నక్షత్ర పూజలు



మరిడమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ఆదివారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



పిఠాపురంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్

పిఠాపురం: స్థానిక కోటగుమ్మం సెంటర్‌లోని కన్యాకాపరమేశ్వరి సత్రంలో ఆదివారం గొల్లప్రోలు మండలం తాటిపర్తి శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వీరభద్రా హోమియో క్లినిక్ వైద్యులు వైఎస్ కిరణ్, సూర్యపవన్‌రామ్, నాగ మనోజ్ఞ, బేతా అఖిల తదితరులు 150 మంది రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అపర్ణా సేవా ట్రస్టు సభ్యులు కోరారు. కార్యక్రమంలో గొల్లప్రోలు మండలం తాటిపర్తి శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు అధ్యక్షుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్కేరావు

కొత్తపల్లి: ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పొన్నాడకు చెందిన లక్కేరావు మోటారు సైకిల్‌పై కాకినాడ విధులకు వెళుతుండగా అమీనాబాదు శివారు రామన్నపాలెం సమీపంలో ఉప్పాడ నుంచి కోనపాపపేట వైపు వెళుతున్న ఆటో ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్కేరావుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కాకినాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆటో మితిమీరిన వేగతంలో వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

గండేపల్లి: స్థానిక కొత్తపేటలో నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయానికి దాత కోర్పు సాయితేజ ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో అడబాల వేంకటేశ్వరరావు, బొల్లంరెడ్డి రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రై..

ఇంటింతై..

- సుందరంగా జగనన్న కాలనీలు
- రెండో విడత నిర్మాణాలకు సిద్ధం



బ్రహ్మానందపురంలో జగనన్న లేఅవుట్

సామర్లకోట: కొత్త ఊళ్లు వస్తున్నాయి.. పేదల కలలు నిజం అవుతున్నాయి.. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించడంతో జగనన్న లేఅవుట్‌లు సరికొత్త గ్రామాలను తలపిస్తున్నాయి.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నవరత్న పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు అందించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులకు సహకారం అందించారు. ఇందులో భాగంగా మొదటి విడతలో సామర్లకోట ఈటీసీ లేవుట్‌లో 2,444 ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పటి వరకూ 1,500 ఇళ్ల పనులు పూర్తయ్యాయి. ఈ జగనన్న కాలనీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన విషయం విధితమే. మండలంలో వేట్లపాలెం, జి.మేడపాడు, పవర గ్రామాల్లో మొదటి విడతలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయి. రెండో విడతలో మిగిలిన గ్రామాల్లో నిర్మాణాలకు అన్నీ సిద్ధం చేశారు. అచ్చంపేట, ఉండూరు, పి.వేమవరం, నవర, గొంచాల, చంద్రంపాలెం, పనసపాడు గ్రామాల్లో లబ్ధిదారులకు సామర్లకోట- అచ్చంపేట ఏడీబీ రోడ్డు సమీపంలోని బ్రహ్మానందపురంలో 50 ఎకరాలను కొనుగోలు చేశారు. ఈ భూములను లేఅవుట్‌గా మార్చారు. ప్రధాన రోడ్డు 30 అడుగులు, ఇళ్ల మధ్య రోడ్లు 18 అడుగులతో లేఅవుట్ వేశారు. ఈ మేరకు లేఅవుట్‌లో లబ్ధిదారులకు చెందిన ప్లాట్లను చూపించడానికి ఆయా గ్రామాల లబ్ధిదారులతో పెద్దాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు, రెవెన్యూ అధికారుల సమక్షంలో సమావేశాలు పూర్తి చేశారు.



సామర్లకోట జగనన్న కాలనీలో పార్కు, సుందరంగా ఇళ్లు

సుందర గ్రామంలా..

బ్రహ్మానందపురం లేఅవుట్ రెండు ప్రధాన రోడ్ల కూడలిలో ఉండడంతో దానికి మంచి డిమాండ్ ఉంది. ఒకవైపు ఉండూరు నుంచి పి.వేమవరం, గొంచాల, అచ్చంపేట, నవర, చంద్రంపాలెం, పనసపాడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు, మరోవైపు సామర్లకోట- అచ్చంపేట ఏడీబీ రోడ్డు ఉంది. ఈ లేఅవుట్‌లో సుమారు 600 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో సుందరమైన గ్రామం రూపుదిద్దుకోనుంది. ఇప్పటికే సామర్లకోట జగనన్న లేఅవుట్ అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది. ప్రతి లబ్ధిదారుకు సెంటున్నర చొప్పున స్థలాలు ఇవ్వడంతో పాటు ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ లేఅవుట్‌లోని స్థలం రూ.రెండు లక్షల నుంచి రూ.మూడు లక్షల వరకూ విలువ చేస్తుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఎన్నటికీ మరిచిపోలేమని లబ్ధిదారులు అంటున్నారు.

జగనన్న మేలు మరచిపోలేం..



ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇవ్వాలనే ఆలోచన ఏ ముఖ్యమంత్రి చేయలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తమకు ఎంతో విలువైన స్థలాలు ఇచ్చారు. ఈ స్థలాలను దవులూరి దొరబాబు ప్రతి ఒక్కరికీ అందించారు. ఇక్కడ ఇళ్ల నిర్మించుకుని సొంతింటి కల నెరవేర్చుకుంటాం. స్థానికుడైన దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకుంటాం.

– మండపాక మంగ, లబ్ధిదారు, నవర

రెండో విడత పనులకు సిద్ధం



రెండో విడతలో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డితో శంకుస్థాపన చేయిస్తాం. లబ్ధిదారులకు రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం, సిమెంట్, ఇసుక, ఐరన్ సబ్సిడీపై అందజేస్తాం. సామర్లకోట జగనన్న కాలనీలో మాదిరిగానే ఇక్కడ పార్కులు నిర్మిస్తాం. లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల సమీపంలోని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తాం.

– దవులూరి దొరబాబు, వైఎస్సార్ సీపీ పెద్దాపురం కో ఆర్డినేటర్, సామర్లకోట

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొత్తపల్లి హైస్కూల్‌లో కలిసిన పూర్వవిద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో 1970 నుంచి 1975 వరకూ చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట కలిసి అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పాఠశాలలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

హరిహర క్షేత్రంలో చోరీకి యత్నం



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలను పరిశీలిస్తున్న పోలీసులు

సామర్లకోట: స్థానిక ఐదు తూముల వద్ద అన్నపూర్ణా సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. బళ్ల మార్కెట్ ఏలేరు కాలువ కాలిబాట వంతెన అవతలి వైపు పిఠాపురం బ్రాంచ్ కెనాల్ మధ్యలో ఈ ఆలయం ఉంది. నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి సుమారు గంట సేపు చోరీకి ప్రయత్నించారు. ఆలయంలో అమ్మవారి నగలను పరిశీలించి అవి రోల్డ్‌గోల్డ్‌గా గుర్తించి వదిలేశారు. హుండీని బయటకు తీసుకువచ్చి పగుల గొట్టారు. అర్చకుని మోటారు సైకిల్ బయటకు తీసుకువచ్చి వదలి పరారయ్యారు. ఈ దృశ్యాలు ఆలయంలోని సీసీ కెమెరాలో పోలీసులు గుర్తించారు. హుండీని ఇటీవల లెక్కించడంతో పెద్దగా నగదు ఉండే అవకాశం లేదని కమిటీ సభ్యులు తెలిపారు. ధర్మకర్త పరమానందగిరి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు, వేలిముద్ర నిపుణులు సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలో చోరీకి జరిగిన ప్రయత్నాలను పోలీసులు రికార్డు చేసుకున్నారు.

కొల్లేటి పాట ఆవిష్కరణ సభకు తరలిరావాలి



పులిమేరులో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘ నేతలు

పెద్దాపురం: కొల్లేటి సరస్సు పరిరక్షణే ధ్యేయంగా అరుణోదయ విమలక్క రచించిన కొల్లేటి పాట ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని పులిమేరులో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సభ్యులు ఆదివారం కరప్రతాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఏలూరులో ఈ నెల 31న విమలక్క పాట ఆవిష్కరణ సభ జరుగుతోందన్నారు. మత్స్యకారులు, పక్షులకు ఆధారమైన కొల్లేటి మంచినీటి సరస్సును భూస్వాములు తమ ఆర్థిక ఎదుగుదలకు వాటుకుంటూ కలుషితం చేస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అరుణోదయం సాంస్కృతిక సమాఖ్య కొల్లేటి గుండె చప్పుడు పేరుతో దండోరా వేసి చాటడానికి ఒక పాటను విమలక్క రూపొందించారన్నారు. సభకు పర్యావరణ ప్రేమికులు, అభ్యుదయవాదులు, విద్యార్థి, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలన్నారు. సంఘ రాష్ట్ర నాయకుడు కొండా దుర్గారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.రాజబాబు, బి.రమేష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కె.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు మఠం వివాదంపై విచారణ



గ్రామస్తులతో మాట్లాడుతున్న కౌన్సిల్ సభ్యులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠం వివాదంపై దేవదాయ, ధర్మాదాయ శాఖ ట్రిబ్యునల్ కమిషన్ ఆదివారం ఆలయం వద్ద విచారణ నిర్వహించింది. పిటీషనర్‌కు దేవదాయశాఖ తూర్పు గోదావరి జిల్లా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు నరసింహారావు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వివరాలను నమోదు చేసుకుని దీనిపై మరోసారి విచారణ చేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఆలయ పరిపాలనా వ్యవహారాలు దేవదాయశాఖ పరిధిలో ఉండాలని, ఎవరికీ ధారాదత్తం చేయడం కుదరదన్నారు. కొంత మంది అర్చకులు గ్రూపుగా ఏర్పడి మఠం ఆస్తులను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. జీయ్యన్న మఠం, మఠాధిపతి హోదా తమకే దక్కుతుందని పిటీషన్‌దారుడు పాడుగు శేషావతారం తన వద్ద ఉన్న రికార్డులను బహిర్గతం చేశారు. తొలుత అధికారులు, కౌన్సిల్ సభ్యులు జీయన్న మఠంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈఓ ఉండమట్ల రాజేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒబిణ్ని సత్యనారాయణ, సర్పంచ్ శీలామంతుల వీరబాబు, మాజీ సర్పంచ్ పైణ్ని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

సామర్లకోట: విద్యుత్తు సరఫరా, వీలింగ్ చార్జీలు, 2024–25 సంవత్సరానికి ప్రతిపాదిత రిటైల్ సరఫరా ధరలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకూ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్లు రాజమహేంద్రవరం, ఆపరేషన్ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ టీవీఎస్ఎస్ మూర్తి ఆదివారం సాయంత్రం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో ఆ రోజుల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని చెప్పారు. వినియోగదారులు పాల్గొని తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

అన్నవరం దేవస్థానానికి వెండి పాత్ర వితరణ



దేవస్థానానికి దాత చెంచురామారావు అందజేసిన వెండి పాత్ర

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి తెనాలికి చెందిన వీసీఆర్ ట్రేడర్స్ అధినేత వందవాశి చెంచు రామారావు రూ.35 వేలు విలువ చేసే 504 గ్రాముల వెండి పాత్రను ఆదివారం అందజేశారు. ఈ పాత్రను సత్యదేవుని ఆలయంలో పూజా కార్యక్రమాలకు ఉపయోగించాలని దాత కోరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు ముగ్గురు వ్యక్తులను అదుపులోకి వారి నుంచి 54 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఆదివారం ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడుల్లో భద్రరావు, వెంకటరమణ, అప్పారావులను అరెస్టు చేసి వారి నుంచి 54 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఎస్సై తెలిపారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



వెంకటరాజును సత్కరిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు

తుని: గణతంత్ర వేడుకల్లో భాగంగా కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న మున్సిపల్ ఉద్యోగి పేరిచెర్ల వెంకటరాజును ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తుని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ రిక్రియేషన్ హోమ్ ప్రతినిధులు వెంకటరాజును శాలువా, పూలమాలతో సత్కరించారు. వెంకటరాజు పట్టణ ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. భవిష్యత్‌తో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

సమాజ సేవకు వేదిక లయన్స్ క్లబ్



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బాదం బాలకృష్ణ, వెంకటరమణ, సత్యవేణి

బాలాజీచెరువు: సమాజ సేవ చేయడానికి లయన్స్ క్లబ్‌లు మంచి వేదికలుగా నిలుస్తాయని లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక సూర్యకళా మందిరంలో ఆదివారం లయన్ రీజినల్ చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, సతీమణి సత్యవేణి అధ్యక్షతన రీజినల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి సమ్మేళనం ద్వారా కొత్తగా సేవా కార్యక్రమాలు, సభ్యత్వాల పెంపు, శాశ్వత ప్రాజెక్టులు వంటి వాటిపై చర్చించడానికి అవకాశం ఉంటుందన్నారు. లయన్స్ ఫౌండేషన్ ద్వారా 30 వేల మందికి డయాబెటిస్ పరీక్షల నిర్వహణతో పాటు 100 అవగాహన కార్యక్రమాల నిర్వహణకు రూ.40 లక్షలు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టు 10 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఉత్తమ సేవలకు గాను లయన్స్ క్లబ్ కాకినాడ సంకల్ప్, లయన్స్ క్లబ్ కాకినాడ, లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్‌లకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంవీఆర్ మోహన్‌కుమార్, దంగేటి సతీష్‌తో వివిధ క్లబ్‌లకు చెందిన 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

బోట్‌క్లబ్: సంగీత విద్వత్సభ సంక్రాంతి సంగీత నృత్యోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక సూర్యకళా మందిరంలో చెన్నైకి చెందిన జేబీ కీర్తన గాత్ర కచేరీ అలరించింది. మోహన వర్ణంతో ప్రారంభించి, ధన్యాసి రాగంలో గానం చేశారు. వీరికి వయోలిన్‌పై ఎం.రామ్‌చరణ్, మృదంగంపై ఎం.శ్రీధర్, మోర్సింగ్‌పై జి.వెంకటేష్ చక్కని సహకారాన్ని అందించారు. తొలుత ముళ్లపూడి నాగేశ్వరరావు, ఎస్వీ రావు జ్యోతి ప్రజ్వలన చేసి గాత్ర కచేరీ ప్రారంభించారు. కళాకారులను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సత్కరించారు.

జోరుగా అక్రమ లే అవుట్లు

- గ్రామాల్లో పట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న లే అవుట్లు
- నిబంధనలకు విరుద్ధంగా పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



కుతుకుడుమిల్లిలో అనుమతి లేకుండా వేసిన లే అవుట్



పొన్నాడలో అక్రమ లేఅవుట్



వాకతిప్పలో పంట పొలాన్ని గ్రావెల్‌తో పూడ్చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో అక్రమ లే అవుట్లు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొందరు అక్రమార్కులు నిబంధనలను తుంగలోకి తొక్కి పంట పొలాలను ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారు. మండలంలోని గోర్స, కొమరగిరి, కుతుకుడుమిల్లి, పొన్నాడ, వాకతిప్ప పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లు వేశారు. పంట పొలాలను కొనుగోలు చేసి ప్లాట్లుగా ఏర్పాటు చేశారు. కనీస అనుమతులు లేకుండా వీటిని గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. వాస్తవానికి వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలంటే అధికారులు అనుమతులు పొందాల్సి ఉంది. అంతేకాకుండా ప్లానింగ్ అధికారులు లే అవుట్‌ను అప్రూవ్ చేయాలి. నిబంధనలను అనుసరించి 30 నుంచి 40 అడుగుల వెడల్పు గల రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సదుపాయం, మంచి నీటి సౌకర్యం కల్పించాలి. దీంతో పాటు మొత్తం లే అవుట్ స్థలంలో 10 శాతం స్థలాన్ని కమ్యూనిటీ సైట్‌గా కేటాయించాలి. అయితే ఇవేమీ పట్టించుకోకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేస్తున్నారు. అధికారులు మాముళ్ల మత్తులో పడి చూసీ చూడనట్లు వ్యవరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా ప్రభుత్వానికి ఎటువంటి చెల్లింపులు లేకుండానే పంట భూములను ఇళ్ల స్థలాలుగా మార్చేసి రోజుల వ్యవధిలోనే విక్రయిస్తున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా అనుమతి లేని లే అవుట్ల యజమానులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

'సిద్ధం' బహిరంగ సభను జయప్రదం చేయండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గోకవరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం



ఎస్.తిమ్మాపురంలో కార్యకర్తలను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: వచ్చే ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ఫిబ్రవరి 1న ఏలూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన సిద్ధం బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహం పిలుపునిచ్చారు. స్థానిక ఎస్‌వీఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం మండలస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరులో నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి కార్యకర్తలు తరలిరావాలని కోరారు. మరో రెండు నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుకు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ యువ నేత తోట రాంజీ, ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, నాయకులు సుంకర వీరబాబు, దాసరి చినబాబు, సుంకర వెంకటరమణ, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సమ్మెటి మోహన్, నరాల శెట్టి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

విజయవంతానికి పిలుపు

కిర్లంపూడి: వచ్చే నెల 1న ఏలూరులో జరిగే సిద్ధం సభను జయప్రదం చేయాలని ఎవస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని సింహాద్రిపురం, భూపాలపట్నం, శృంగరాయునిపాలెం, ఎస్.తిమ్మాపురం, గోనేడ, పాలెం, సోమరాయణంపేట గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిసి సిద్ధం సభ విజయవంతంపై చర్చిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో తోట అయ్యన్న, ఓలేటి రాజు, బేరి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు



రాజ్యలక్ష్మీ ఉద్యానంలో ఆంజనేయ స్వామికి పూజలు

కాకినాడ రూరల్: సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న రాజ్యలక్ష్మీ ఉద్యానం వద్ద ఆంజనేయ స్వామి విగ్రహానికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపన జరిగిన నేపథ్యంలో సీతారాముల పట్టాభిషేకం, హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ హనుమాన్ చాలీసా, సుందరకాండ పారాయణ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు పుల్ల చందు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకుడు గాలిదేవర బాలాజీ పాల్గొన్నారు.